ప్రాధాన్యం లేని పాత్ర!



బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన దృశ్యకావ్యం.. పద్మావత్! ఎన్నో వివాదాలు, మరెన్నో మలుపులతో 2018లో విడుదలైన ఈ చిత్రం.. బాక్సాఫీస్ వద్ద రూ.600 కోట్లకుపైగా కొల్లగొట్టింది. ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన దీపికా పదుకొణె.. అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. అయితే, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్.. 'పద్మావత్'లో దీపిక పోషించిన పాత్ర.. ఏమాత్రం ప్రాధాన్యం లేనిదని చెప్పుకొచ్చింది. అందుకే.. ఆ పాత్ర చేయమని డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ నుంచి తనకు ఆఫర్ వచ్చినప్పుడు.. సున్నితంగా తిరస్కరించినట్టు వెల్లడించింది. ''నాకు మొదట్లోనే 'పద్మావత్' ఆఫర్ వచ్చింది. అయితే, స్క్రిప్ట్ ఇవ్వడానికి డైరెక్టర్ నిరాకరించారు. దాంతో, నా పాత్ర ఏమిటని అడిగాను. దానికి ఆయన చెప్పిన సమాధానం.. 'హీరోయిన్ పాత్ర ఇంతే! ఆమె ముస్తాబవుతున్నప్పుడు ఆమెను హీరో మొదటిసారి అద్దంలో చూస్తాడు!' అని మాత్రమే చెప్పారు. అంతకుమించి ఏమీ ఉండదనీ అన్నారు. దాంతో, నేను ఆ సినిమాను తిరస్కరించాను. నేను ఆ సినిమా చూసినప్పుడు కూడా.. డైరెక్టర్ చెప్పింది నిజమే అనిపించింది!'' అంటూ చెప్పుకొచ్చింది కంగన. అయితే, ఆమె వ్యాఖ్యలపై ఇంటర్నెట్‌లో చర్చ మొదలైంది. కంగన మాటలను కొందరు తప్పుపడితే.. మరికొందరు 'నిజమే కదా!' అంటున్నారు. పద్మావత్ చిత్రంలో.. పాటలు, క్లయిమాక్స్ మినహా.. సినిమా మొత్తం దీపికా అద్దం ముందు నిలబడి తయారవుతూనే కనిపిస్తుందని కొందరు నెటిజన్లు విమర్శిస్తున్నారు. మరోవైపు, ఆ చిత్రంలోని పాటలు, అందులో దీపిక చేసిన నృత్యాలు అద్భుతమని మరికొందరు పొగుడుతుంటే.. దీపిక నటనను ఇంకొందరు ఆకాశానికి ఎత్తుతున్నారు. ఇక కంగన విషయానికి వస్తే.. ఆమె దర్శకత్వం వహించి, నటించిన తాజా సినిమా 'ఎమర్జెన్సీ'. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రలో.. 1975 నాటి 'ఎమర్జెన్సీ' ఇతివృత్తంగా తెరకెక్కింది. 2023లోనే సినిమా షూటింగ్ పూర్తయినా.. విడుదల వాయిదా పడుతూ వచ్చింది. ఈ జనవరి 17న థియేటర్లలో విడుదలైంది.



ఓ డెబ్బయ్ ఏండ్ల క్రితం.. సినిమా అంటే, కథ సంసారపక్షంగా ఉండాలి.. కథనం సాగదీతగా ఉన్నా.. పద్ధతిగా సాగాలి.. ఏ కొంచెం తేడాగా ఉన్నా.. జనాలు 'ఛీ' కొట్టడం ఖాయం. అలాంటి రోజుల్లో.. లివింగ్ రిలేషన్‌షిప్ బాపతు కథను సిద్ధం చేసుకున్నారు దర్శక, నిర్మాతలు. పాత్రలు ఎంత మర్యాదగా నడుచుకున్నా.. ఎంతటి ఔన్నత్యాన్ని ప్రదర్శించినా.. 'మిస్సమ్మ' ఆ కాలానికి, ఆ మాటకొస్తే.. ఆ తర్వాత ఐదు దశాబ్దాల వరకూ.. సాహసమే! ఆ ప్రయోగాత్మక చిత్రం 'మిస్సమ్మ' 1955 సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైంది. అఖండ విజయాన్ని అందుకుంది. తెలుగు చిత్రసీమ అపురూప చిత్రాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. 70 వసంతాలు పూర్తి చేసుకున్న 'మిస్సమ్మ' ముచ్చట్లు ఇవి..

70 వసంతాల మిస్సమ్మ

ఎంటీ రావు తెలివైనవాడు. మిస్ మేరీ అందగత్తె, అభిమానవతి. ఓ అనివార్యత ఈ ఇద్దరినీ ఒక్కటి చేస్తుంది. 'ఉదర నిమిత్తం' రావు రంగం సిద్ధం చేస్తే.. అప్పు ముప్పు తప్పించుకోవడానికి మేరీ సాహసం చేస్తుంది..
సొంత భార్యాభర్తలు కూడా చనువుగా మాట్లాడుకోవడానికి మొహమాటపడే రోజులవి. ఆ కాలంలో ముఖ పరిచయం మాత్రమే ఉన్న ఆడ-మగ... ఆలుమగలుగా నటించాలని నిర్ణయానికి రావడం అప్పటి సమాజానికి ఆశ్చర్యమే! అదేమో గానీ ఆ ఇద్దరి బంధాన్నీ యాక్సెప్ట్ చేశారు ప్రేక్షకులు. మేరీ బెట్టు చేస్తే.. ముసిముసిగా నవ్వుతూ మురిసిపోయారు. ఆమెను రావు బతిమాలుతుంటే.. అతని వంక జాలిగా చూశారు. ఆమె పేచీ పడినా నవ్వుకున్నారు. ఆల్రెడీ ప్రేమలో పడిందిలే అని తీర్మానించుకున్నారు.

పెండ్లవ్వని 'రావు-మేరీ' జంట పాత్రలకు వంతపాడేందుకు విజయవారి కాంపౌండ్‌లో నటులకు కొదువా?! అందుకే ఘనాపాఠీలనే రంగంలోకి దించారు నిర్మాతలు నాగిరెడ్డి-చక్రపాణి. అప్పాపురం జమీందారు గోపాలం పాత్రకు ఎస్వీఆర్, అతని భార్య పాత్రలో రుష్యేంద్రమణి కుదురుకున్నారు. వారి గారాలపట్టి సీతగా జమున వచ్చింది. మొండిఘటం దేవయ్యగా రేలంగి, మేరీ మీద మనసుపడిన ఇంటి ఓనర్ డేవిడ్‌గా రమణారెడ్డి.. ఇలా జట్టంతా అదిరింది. దర్శకుడు ఎల్వీ ప్రసాద్ ఓకే అన్నాడు. నిర్మాతలు ఫుల్ ఖుషీ.

చిత్రంలో మరో ప్రధాన పాత్ర గురించి చాలా రోజులు అన్వేషణ సాగింది. 'మిస్సమ్మ' గుట్టు విప్పే డిటెక్టివ్ పాత్ర అది. పర్‌ఫెక్ట్ కామెడీ టైమింగ్ ఉండాలి. తికమకగా కనిపించాలి. చురుకుగా స్పందించాలి. మరదలిపై పొంగుకొచ్చే ప్రేమను పైకి కనిపించనివ్వకూడదు. ఆ మరదలు చనువుగా ఉంటున్న రావుపై మండిపడకూడదు. పంతులమ్మ ఉరఫ్ మేరీ చొరవగా మాట్లాడితే అయిష్టంగానే స్పందించాలి. ఇన్ని పార్శ్వాలున్న పాత్రకు ఎవరు అతికినట్టు సరిపోతారు? జగ్గయ్యను అనుకున్నారు. ఎందుకో కుదర్లేదు. మరెవరినో అనుకుంటున్నారు. విషయం ఏయన్నార్ చెవిలో పడింది. దేవదాసు తర్వాత అక్కినేనికి అన్నీ సీరియస్ కథలే వస్తున్నాయి. 'మిస్సమ్మ'లో డిటెక్టివ్ రాజు పాత్ర తన కెరీర్‌కు కొత్తదారి చూపిస్తుందని భావించాడు ఏయన్నార్. అదే కారణం చెప్పి నిర్మాతలను కన్విన్స్ చేశాడు. 'అంతకంటేనా' అని వాళ్లు ఆమోదించారు. అలా అక్కినేని తెలుగు వెండితెర తొలి డిటెక్టివ్ అయ్యాడు!

మిస్సమ్మ క్యారెక్టర్‌తో సావిత్రికి ఎంత స్టార్‌డమ్ వచ్చిందో... ఏకే రాజు పాత్రతో ఏయన్నార్‌కూ అంతే పేరు దక్కింది. దీనికితోడు చక్రపాణి స్క్రిప్ట్ భలేగా పనిచేసింది. ఫుల్‌లెంగ్త్ కామెడీ సినిమాలో ఒక్కరూ తగ్గితే ఒట్టు. అప్పాపురానికి వచ్చిన పంతులు జంటతో రాజు 'ఐ యామ్ మిస్టర్ ఏకే రాజు ప్రైవేట్ డిటెక్టివ్, ఎక్స్ హెడ్‌మాస్టర్ అండ్ ప్రజెంట్ సెక్రటరీ ఆఫ్ మహాలక్ష్మి ఎలిమెంటరీ స్కూల్, అప్పాపురం..' అని ఏకబిగిన చెప్తాడు గర్వంగా పోజిస్తూ! 'అదేం లేదులేండి.. మా మేనల్లుడే' అని తుస్సుమని గాలితీస్తాడు గోపాలం. ఇలాంటి సీన్లు 'మిస్సమ్మ'లో ఎన్నో!!

బెంగాలీ చిత్రం 'మన్మోయీ గర్ల్స్ స్కూల్' మన మిస్సమ్మకు మూలాధారం. ఈ బెంగాలీ మాతృక నుంచి మూలకథను మాత్రమే గ్రహించారు. మిగతా సన్నివేశాలన్నిటిలో తెలుగుదనం కొట్టొచ్చేట్టు, హాస్యం అపరిమితంగా పండేటట్టు స్క్రిప్ట్ సిద్ధం చేశారు చక్రపాణి. సినిమా మొదలయ్యాక అరగంటకు అసలు కథ ప్రారంభం అవుతుంది. నిరుద్యోగ పర్వంలో కొట్టుమిట్టాడుతున్న రావు పత్రికలో ఓ ప్రకటన చూస్తాడు. బీఏ పాసైన పంతులు, పంతులమ్మ కావాలని అందులో ఉంటుంది. అది చదివిన ఆనందం నుంచి తేరుకోకముందే.. ఆ ఇద్దరూ భార్యాభర్తలై ఉండాలన్న షరతూ కనిపిస్తుంది. ఇంకేముంది యోగాలు అంత తొందరగా రావు అనుకుంటాడు రావు. పైగా ఎవరు తన పేరు అడిగినా ఎంప్టీ రావు (ఖాళీ రావు) అని చెప్పుకొంటూ ఉంటాడు. ఆ నిరాశలో ఉండగానే మేరీ అక్కడికి వస్తుంది. అంతకు ముందే వారికి కాస్త పరిచయం ఉంటుంది! ఆ ప్రకటనను తనకిచ్చి 'మీకేమైనా ఉపయోగపడుతుందో చూడండి' అంటాడు. అది చదివి ఆమె కూడా పెదవి విరుస్తుంది. తానింకా మిస్ మేరీనే అని చెబుతుంది. దేవయ్య సావాస దోషం.. రావు ఎంప్టీ బుర్రలో తళుక్కున ఓ ఆలోచన మెదులుతుంది. నసిగీ నసిగీ 'ఈ ఉద్యోగాల కోసం మనం భార్యాభర్తలుగా నాటకం ఆడితే..' అని అడిగేస్తాడు. చర్రున లేచి పెట్టాల్సిన నాలుగు చీవాట్లు పెట్టి అక్కణ్నుంచి వెళ్లిపోతుంది మేరీ!

ఈ సన్నివేశంలో పింగళి వారి పాళి.. సినిమా ముందుకు సాగేందుకు వారధి నిర్మిస్తుంది. ఆ ఒక్కమాట.. ఆ ఒక్కపాట.. కడలి కన్నా లోతైన అతివ హృదయాన్ని ఆవిష్కరించింది. 'ఔనంటే కాదనిలే... కాదంటే ఔననిలే.. ఆడువారి మాటలకూ అర్థాలు వేరులే..' ఈ పాట నిత్య సత్యమై కూర్చుంది. నానుడిగా నేటికీ జనాల నాల్కలపై నానుతున్నది. 'విసిగిన సిరి కసిరినచో.. విషయ మసలు ఇష్టములే..' ఈ ఒక్క పంక్తి ఈ డెబ్బయ్ ఏండ్లలో ఎన్ని బంధాలకు పురుడు పోసిందో! ఈ ఒక్కపాటతో పింగళి ప్రస్తావన ఆపేస్తే కుదరదు!! 'బృందావనమది అందరిదీ గోవిందుడు అందరి వాడేలే..' ఎవర్‌గ్రీన్ హిట్. 'రావోయి చందమామ..' మిస్సమ్మ కవ్వింత గాథకే కాదు, తర్వాతి కాలంలో జరిగిన ఎన్నెన్నో వింతలకు వంత పాడుకునే మకుటమైంది. 'ఏమిటో ఈ మాయా..', 'కావాలంటే ఇస్తాలే..' ఇలా ప్రతి పాటా ఆణిముత్యమే! పింగళి సాహిత్యానికి స్వరేశ్వరరావు సాలూరి రాజేశ్వరరావు బాణీలు భలేగా కుదిరాయి. అందుకే 'మిస్సమ్మ' పాటలు ఇంకో పాతికేళ్లయినా అంతే ఫ్రెష్‌గా ఉంటాయి. కృత్రిమ మేధ.. ప్లే లిస్ట్‌లోనూ చోటు దక్కించుకుంటాయి.

మళ్లీ కథలోకి వస్తే... అప్పాపురం జమీందారు గోపాలం పెద్దబిడ్డ మహాలక్ష్మి ఎప్పుడో చిన్నప్పుడు మహాలయ పక్షాల్లో కాకినాడ సముద్ర తీరంలో తప్పిపోతుంది. ఆ తప్పిపోయిన చిన్నారి ఓ క్రైస్తవ దంపతుల దగ్గర పెరుగుతుంది. ఆవిడే మేరీ. మన మిస్సమ్మ. ఈ మిస్సమ్మే మహాలక్ష్మి అని సినిమా మొదటి రెండు సీన్లలోనే చెప్పేస్తాడు రచయిత చక్రపాణి. సస్పెన్స్, కామెడీ ఒక ఒరలో ఇమడవు అనే వారాయన. అందుకే, మేరీ మరెవరో కాదు మహాలక్ష్మి అని సినిమా మొదట్లోనే ప్రేక్షకులకు హింట్ ఇచ్చాడు. కానీ, ఆ విషయం ఇతర పాత్రలకు తెలియకుండా సస్పెన్స్ క్రియేట్ చేశాడు.

మరోవైపు తప్పిపోయిన కూతురు పేరిటే అప్పాపురంలో పాఠశాల పెడతాడు గోపాలం. విద్యావంతులైన బడిపంతుళ్లు లేక పాఠశాల నిర్వహణ కుంటుపడుతుంది. స్కూలు చూసుకుంటాడనుకున్న మేనల్లుడేమో డిటెక్టివ్ అవతారం ఎత్తుతాడు. ఆ బడిని ఒక బాటలో పెట్టడానికి దంపతులైన టీచర్లు కావాలంటూ ప్రకటన ఇస్తాడు. ఆ యాడ్ ఫలితంగానే రావు, మేరీ దంపతులమంటూ అప్పాపురానికి చేరుకుంటారు. అక్కడ గోపాలం, అతని భార్య చూపే ఆదరం మేరీని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. క్రైస్తవురాలైన ఆమెకు ఈ హిందూ ఆచారాలు నచ్చవు. తమ ఇంటి యజమాని అప్పు తీర్చడానికి కొన్నిరోజులు భరిస్తుంది. గోపాలం దంపతుల అత్యుత్సాహాన్ని, మేరీ కోపతాపాలను భరించలేక రావు పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారవుతుంది.

ఇక మేనమామ పెద్ద కూతురును కనిపెట్టే క్రతువులో బిజీగా మారిపోతాడు రాజు. దేవయ్య దగ్గర ఆరాలు తీయడం మొదలుపెడతాడు. ఈ క్రమంలో చాలా చమురు వదిలించుకుంటాడు. గోపాలం చిన్న కూతురు సీతది మరో గోల. పాటలు నేర్పమంటూ రావుతో చనువుగా ఉంటుంది. ఇది మేరీకి నచ్చదు. ఈ విపరీతానికి విరుగుడుగా డిటెక్టివ్ రాజుకు సంగీతం నేర్పాలని కంకణం కట్టుకుంటుంది మిస్సమ్మ. ఈ క్రమంలో 'మాకు మేమే.. మీకు మీరే...' అంటూ రుసరుస రాగంలో గుసగుస పాట నేర్పే ప్రయత్నం చేస్తుంది. 'బృందావనమది అందరిదీ..' అంటూ సీతకు పాట నేర్పుతుంటాడు రావు. ఇలా కథ రకరకాల మలుపులు తిరుగుతుంది. ప్రతి మలుపులోనూ హాస్యమే గెలుస్తుంది. చివరాఖరికి పంతులమ్మగా వచ్చిన మిస్సమ్మ... చిన్నప్పుడు తప్పిపోయిన మహాలక్ష్మి అని రాజు నిరూపించి.. గోపాలం మామయ్యతో 'డిటెక్టివ్' అనిపించుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది.

ఆద్యంతం హాస్య భరితంగా రూపుదిద్దుకున్న మిస్సమ్మ అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. 'లేచింది నిద్ర లేచింది మహిళా లోకం..' అని 'గుండమ్మకథ' పిలుపునిచ్చింది 1962లో! కానీ, అంతకు ఏడేండ్ల కిందటే వచ్చిన 'మిస్సమ్మ' స్త్రీ సాధికారతను గొప్పగా నిరూపించింది.

...✍ కణ్వస

రెండిటి కలబోత

'మిస్సమ్మ' చిత్రానికి మూలం బెంగాలీ సినిమా 'మన్మోయీ గర్ల్స్ స్కూల్'. చిత్రంగా రాకముందు నాటకంగానూ ప్రసిద్ధి చెందింది. దీన్నే 1942లో 'ఉదర నిమిత్తం' నాటకంగా తెలుగులో అనువదించారు చక్రపాణి. 1954లో విడుదలైన విజయా ప్రొడక్షన్స్ 'చంద్రహారం' భారీ పరాజయం మూటగట్టుకుంది. దీంతో పూర్తి హాస్య చిత్రం తీయాలని భావించారు నాగిరెడ్డి-చక్రపాణి. ఆ సమయంలో చక్రపాణికి 'ఉదర నిమిత్తం' గుర్తొచ్చింది. అయితే, ఆ నాటకాన్ని సినిమా తీస్తే నిడివి సరిపోదు అనిపించింది. దీంతో ఆయనే రాసిన మరో నాటకం 'డిటెక్టివ్'లో నుంచి కూడా కొంత భాగం తీసుకొని.. రెండిటినీ కలిపేసి 'మిస్సమ్మ' కథ సిద్ధం చేశారు.

భానుమతి మిస్

'మిస్సమ్మ'లో మేరీ పాత్రకు మొదట భానుమతిని అనుకున్నారు. సీతగా సావిత్రిని ఎంపిక చేశారు. నాలుగు రీళ్ల వరకూ షూటింగ్ కూడా చేశారు. అయితే, వరలక్ష్మి వ్రతం కారణంగా భానుమతి ఓ రోజు సెట్‌కు ఆలస్యంగా వచ్చింది. ముందురోజు తాను ఆలస్యంగా వస్తానని అసిస్టెంట్స్‌కు చెప్పిందట కూడా! అయితే, ఆ సంగతి చక్రపాణి చెవిన పడలేదు. భానుమతి ఆలస్యంగా రావడంతో ఆయన అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. మిస్సమ్మ కన్నా అభిమానవతి అయిన భానుమతీ అదే రేంజ్‌లో ప్రతి స్పందించింది. దీంతో ఆమెను తప్పించి ఆ పాత్ర సావిత్రికి ఇచ్చారట. సీత పాత్రకు జమునను ఎంపిక చేశారు.

ఘంటసాల మిస్

గాన గంధర్వుడు ఘంటసాల అంటే విజయవారికి ప్రత్యేక అభిమానం. మిస్సమ్మ సినిమాకు ఆయనతో సంగీత దర్శకత్వం చేయించాలని భావించారు నాగిరెడ్డి-చక్రపాణి. సినిమా స్క్రిప్ట్ కూడా సిద్ధం కాకముందే.. 'తర్వాతి సినిమాలో కాస్త క్రైస్తవానికి దగ్గరగా ఉండే ట్యూన్స్ అవసరం పడతాయి.. సిద్ధంగా ఉండండి' అని కూడా అన్నారట. కానీ, డైరెక్టర్ ఎల్వీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా సాలూరి రాజేశ్వరరావును ఎంచుకొన్నాడు. దీంతో 'మిస్సమ్మ' ఘంటసాలకు మిస్ అయింది. సినిమా పాటలు పాడమంటే మాస్టారు ఏమనుకుంటారో అని.. నేపథ్య గాయకుడిగా ఏఎమ్ రాజాకు మొగ్గు చూపారు. అలా 'మిస్సమ్మ' పాటల్లోనూ ఘంటసాల గాత్రం మిస్సయ్యాం.

దాగని రహస్యం
సూక్ష్మదర్శిని

ఓటీటీ హిట్

డిస్నీ+హాట్ స్టార్: జనవరి 10
తారాగణం: నజ్రియా నజీమ్, బాసిల్ జోసెఫ్, మెరిన్ ఫిలిప్, పూజా మోహన్రాజ్ తదితరులు
దర్శకత్వం: ఎంసీ జితిన్

వైవిధ్యమైన చిత్రాలను తెరకెక్కించడంలో మలయాళీలు ఎప్పుడూ ముందే ఉంటారు. థ్రిల్లర్ కథాంశాలకు కామెడీని జోడిస్తూ.. వినూత్నమైన సినిమాలను అందిస్తుంటారు. ముఖ్యంగా.. సమాజంలో జరిగే నేరాలు, సంఘటనలను కళ్లకు కట్టినట్టు చూపిస్తుంటారు. కథ, కథనం చిన్నదే అయినా.. స్క్రీన్‌ప్లేతోనే తెలియని మాయచేస్తారు. సామాన్య ప్రేక్షకుడి ఊహకు అందకుండా సినిమాలను మలుస్తారు. అలాంటి మరో థ్రిల్లర్ కామెడీ చిత్రమే.. సూక్ష్మదర్శిని. 'రహస్యం' అనేది ఎప్పుడో ఒకప్పుడు బహిర్గతం కావాల్సిందే! అని చెప్పే చిత్రమిది. కథలోకి వెళ్తే.. ప్రియా (నజ్రియా), ఆంటోని (దీపక్) దంపతులు. ఇరుగు పొరుగున జరిగే విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్న కుతూహలంతో ఉంటుంది ప్రియ. ఈక్రమంలో చాలాకాలం కిందే ఊరు విడిచి వెళ్లిపోయిన మాన్యుయెల్ (బాసిల్ జోసెఫ్), తన తల్లికి ఆరోగ్యం బాగోలేక తిరిగి సొంతూరికి తీసుకుని వస్తాడు. తన తల్లి అల్జీమర్స్‌తో బాధపడుతున్నట్టు చుట్టుపక్కల వాళ్లకు చెబుతాడు. ఈ క్రమంలో ఆమె అప్పుడప్పుడూ ఇల్లు వదిలిపెట్టి వెళ్లిపోతుంటుంది. మాన్యుయెల్, పోలీసులు ఆమె జాడ తెలుసుకుని తీసుకువస్తుంటారు. మాన్యుయల్ వాళ్ల పక్కింట్లోనే ఉండే ప్రియ.. ఆ పెద్దావిడ ప్రవర్తనను గమనిస్తూనే ఉంటుంది. ఆమెకు అల్జీమర్స్ లేదని భావిస్తుంది. మాన్యుయెల్ ప్రవర్తన కూడా ఆమెకు అనుమానంగా తోస్తుంది. ఇదే విషయం భర్తకు చెబితే.. అనవసర విషయాల్లో జోక్యం చేసుకోవద్దని మందలిస్తాడు. ఇలా ఉండగా.. ఒకసారి తన తల్లి మళ్లీ కనిపించకుండా పోయిందని మాన్యుయెల్ చెబుతాడు. అలా చెప్పిన నాలుగు రోజులకే.. ఓ రాత్రివేళ ఆ ఇంట్లోనే అతని తల్లిని ప్రియ చూస్తుంది. మరుసటి రోజు మాన్యుయెల్‌ను అడిగితే.. ఆమె జాడ దొరకలేదనే చెబుతాడు. దాంతో ప్రియకు అనుమానం బలపడుతుంది. ఆ ఇంట్లో ఏదో జరుగుతున్నదనీ ఆమెకు అర్థమవుతుంది. అప్పుడు ప్రియ ఏం చేస్తుంది? ఫలితంగా ఆమెకు ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి? అసలు ఆ ఇంట్లో ఏం జరుగుతున్నది? మాన్యుయెల్ తల్లి ఇంటి నుంచి వెళ్లిపోవడానికి అల్జీమర్సే కారణమా? అనేది మిగిలిన కథ.

అలా.. ఆలియా

అందం, అభినయంతో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నది బాలీవుడ్ బ్యూటీ ఆలియా భట్! డైరెక్టర్ మహేశ్ భట్ కూతురిగా.. ఇండస్ట్రీలో అడుగుపెట్టినా.. తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్‌ను సొంతం చేసుకుంది. తన రెండో చిత్రం 'హైవే'తోనే అవార్డుల వేట మొదలుపెట్టింది. రోడ్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో, కిడ్నాప్ బాధితురాలిగా నటించి.. విమర్శకుల ప్రశంసలు అందుకున్నది. ఈ చిత్రంలో ఆమె నటనకు 'ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్' అవార్డునూ గెలుచుకున్నది. అయితే, ఈ పాత్ర కోసం మొదటగా ఎవరైనా సీనియర్ నటిని ఎంపిక చేయాలని అనుకున్నాడట చిత్ర డైరెక్టర్ ఇంతియాజ్ అలీ. బాలీవుడ్‌లో అత్యంత ప్రతిభావంతులైన దర్శకులలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న ఇంతియాజ్.. పదేళ్ల క్రితం 'హైవే' చిత్రాన్ని తెరకెక్కించాడు. తాజాగా, ఓ ఆన్‌లైన్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ సినిమాకు సంబంధించిన ముచ్చట్లను పంచుకున్నాడు. ''హైవేలో ఆలియా పోషించిన వీర త్రిపాఠి పాత్ర కోసం 30 ఏళ్లు పైబడిన సీనియర్ నటిని తీసుకోవాలని అనుకున్నాను. ఎందుకంటే, ఆ పాత్ర ఎంతో పరిణతితో కూడుకున్నది. కాబట్టి, యువ నటీమణులను ఎవ్వరినీ పరిగణనలోకి తీసుకోలేదు. కానీ, అనుకోకుండా ఈ స్క్రిప్ట్ ఆలియా చేతికి వచ్చింది!'' అంటూ నాటి విషయాలను గుర్తు చేసుకున్నాడు. నిజానికి ఆలియా మొదటిచిత్రం 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' కూడా ఇంతియాజ్ చూడలేదట. అయితే, ఆమెను మొదటిసారి ఏదో సందర్భంలో కలిసినప్పుడు.. ఆమెలో నిజమైన నటిని చూశాననీ, అందంతోపాటు ఆమెలోని భావోద్వేగ సామర్థ్యాలు కూడా తనను ఎంతో ఆశ్చర్యపరిచాయని ఇంతియాజ్ చెప్పుకొచ్చాడు. దాంతో, 'హైవే' స్క్రిప్ట్‌ను ఆమెకు అందించాడట. కానీ, ఈ చిత్రం చేయడానికి ఆలియా కూడా సందేహించిందట. సినిమాలోని దాదాపు ప్రతి సన్నివేశంలోనూ కనిపించడం, తనతోనే ఎక్కువ షూటింగ్ ఉండటంతో ఆమె సినిమాను చేయలేనని మొదట చెప్పిందట. కానీ, ఇంతియాజ్ ఆమెను ఒప్పించి.. ఈ పాత్ర చేయించాడట. కట్ చేస్తే.. 'హైవే' చిత్రంతోనే ఆలియా కెరీర్ మలుపు తిరిగింది. ఈ చిత్రంలో ఆమె నటన.. విమర్శకుల ప్రశంసలను పొందింది. ఉత్తమ నటి (క్రిటిక్స్)గా ఫిలింఫేర్ అవార్డునూ అందుకున్నది. ప్రస్తుతం భారీ రెమ్యూనరేషన్ అందుకుంటున్న బాలీవుడ్ బ్యూటీలలో ఒకరిగా దూసుకుపోతున్నది ఆలియా!